సాక్షి
డా. బి ఆర్ అంబేడ్కర్ కోనసీమ
ఆదివారం । 29 । అక్టోబర్ । 2023



రూ.8 లక్షల విరాళం

అన్నవరం: సత్యదేవుని నిత్యాన్నదాన పథకానికి హనుమాన్ జంక్షన్‌కు చెందిన దాత నారగాని వెంకటేశ్వరమ్మ రూ.8 లక్షల విరాళాన్ని దేవస్థానం ఈఓ చంద్రశేఖర్ అజాద్‌కు శనివారం అందజేశారు.



డెల్టాలకు నీరు విడుదల

ధవళేశ్వరం: కాటన్ బ్యారేజీ నుంచి శనివారం 14,100 క్యూసెక్కుల నీటిని విడుదల చేశారు. తూర్పుడెల్టాకు 4,300, మధ్యడెల్టాకు 2,600, పశ్చిమడెల్టాకు 7,200 క్యూసెక్కులు వదిలారు.

అక్రమ మార్గంలో ఆర్జించాలని..



అధిక సొమ్ముకు ఆశ పడ్డారు.. అక్రమ మార్గంలో ఆర్జించాలని ఎత్తులు వేశారు.. చివరికి పోలీసులకు చిక్కి కటకటాల పాలయ్యారు. హర్యానా మద్యాన్ని అక్రమంగా విక్రయిస్తున్న ఆరుగురిని పోలీసులు అరెస్ట్ చేసిన ఘటన రాజమహేంద్రవరంలో చోటుచేసుకుంది.

8లో

న్యూస్‌రీల్

వెంకన్న క్షేత్రం.. ఆధ్యాత్మిక పరవశం



భక్తులతో పోటెత్తిన వెంకన్న ఆలయం

ఆత్రేయపురం: కోనసీమ తిరుపతిగా ఖ్యాతికెక్కిన వాడపల్లి శ్రీదేవి, భూదేవి సమేత వేంకటేశ్వర స్వామి ఆలయం శనివారం గోవిందనామ స్మరణతో మార్మోగింది. రాష్ట్రం నలుమూలల నుంచి సుమారు 30 వేల మంది భక్తులు తరలివచ్చి స్వామివారిని దర్శించుకున్నారు. ఏడు శనివారాల నోము ఆచరించిన భక్తులు అధిక సంఖ్యలో వచ్చి స్వామిని చూసి తన్మయత్వం పొందారు. స్వామి వారిని ద్రాక్ష, యాపిల్ పండ్లు, ప్రత్యేక పుష్పాలతో ప్రత్యేకంగా అలంకరించారు. ఉదయం స్వామివారికి సుప్రభాత సేవ, నీరాజన మంత్రపుష్పం, పుణ్యాహవాచనం తదితర పూజలు నిర్వహించారు. భక్తులకు ఇబ్బందులు లేకుండా అధికారులు ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. ఆలయ ఆవరణలో భారీ అన్నసమారాధన జరిగింది. ఈ ఒక్క రోజే ప్రత్యేక దర్శనం, అన్నప్రసాద విరాళాలు, వివిధ సేవలు, లడ్డూ విక్రయాలు, విరాళాల ద్వారా రూ.20,64,712 ఆదాయం సమకూరిందని ఆలయ కమిటీ చైర్మన్ రుద్రరాజు రమేష్‌రాజు, ఈఓ ముదునూరి సత్యనారాయణరాజు తెలిపారు. ఆలయం వద్ద ట్రాఫిక్‌ను ఎస్సై కిరణ్‌కుమార్ ఆధ్వర్యంలో పోలీసులు క్రమబద్ధీకరించారు.

అప్పన్న ఆలయం.. భక్తజన కోలాహలం



బాల బాలాజీ స్వామిని దర్శించుకుంటున్న భక్తులు

మామిడికుదురు: అప్పనపల్లిలోని బాల బాలాజీ స్వామి ఆలయం శనివారం భక్తులతో కోలాహలంగా మారింది. తెల్లవారు జాము నుంచే రద్దీ మొదలైంది. అర్చకులు సుప్రభాత సేవతో స్వామివారిని మేల్కొలిపి పూజల అనంతరం నిత్య హోమం చేశారు. స్వామివారికి వివిధ సేవల ద్వారా రూ.1.50 లక్షల ఆదాయం వచ్చింది. లడ్డూ ప్రసాదం, దర్శనం టిక్కెట్ల విక్రయం ద్వారా రూ.1.12 లక్షలు, నిత్యాన్నదానానికి రూ.38,072 విరాళాలుగా వచ్చాయి. 1,830 మంది భక్తులు స్వామివారి అన్నప్రసాదం స్వీకరించారు. ఈ ఏర్పాట్లను ఆలయ ఈఓ జి.శ్రీదేవి, ధర్మకర్తల మండలి చైర్మన్ చిట్టూరి రామకృష్ణ, ట్రస్టు బోర్డు సభ్యులు పర్యవేక్షించారు.

జాతీయస్థాయి సెపక్‌తక్రా పోటీలకు ఎంపిక



కోచ్ గౌతమ్‌తో సెపక్‌తక్రా పోటీలకు ఎంపికైన సతీష్, మోహన్‌కృష్ణ

అమలాపురం రూరల్: గోవాలో ఈ నెల 30వ తేదీ నుంచి వచ్చే నెల 4 వరకూ జరిగే 37వ జాతీయ స్థాయి సెపక్‌తక్రా పోటీల్లో రాష్ట్ర జట్టులో పాల్గొనేందుకు జిల్లాకు చెందిన ఇద్దరు క్రీడాకారులు ఎంపికయ్యారని కోచ్ యాండ్ర గౌతమ్ తెలిపారు. అమలాపురానికి చెందిన క్రీడాకారులు కేతా సతీష్, చొల్లంగి మోహన్‌కృష్ణ రాష్ట్రం తరఫున ఆడతారని వివరించారు. జిల్లా నుంచి నలుగురు జాతీయ స్థాయి క్యాంపునకు వెళ్లగా ఈ ఇద్దరూ ఎంపికయ్యారన్నారు. క్రీడాకారులు సతీష్, మోహన్‌కృష్ణ ఇప్పటికే పదిసార్లు జాతీయ స్థాయి పోటీల్లో పాల్గొని ఉత్తమ ప్రతిభ కనబరిచారు. ఎంపికైన క్రీడాకారులతో పాటు కోచ్ యండ్రా గౌతమ్‌ను రాష్ట్ర సెపక్‌తక్రా క్రీడా సంఘ ప్రధాన కార్యదర్శి జి.శ్రీనివాసులు, జిల్లా క్రీడా ప్రాధికార సంస్థ చీఫ్ కోచ్ సురేష్‌కుమార్, జిల్లా సెపక్‌తక్రా సంఘ కార్యదర్శి మునగాల మన్యం అభినందించారు.

ఊతమిస్తూ.. ఊపిరిపోస్తూ..

- కొబ్బరి, మత్స్య ఉత్పత్తుల ఎగుమతుల పెంపునకు కృషి
- జిల్లా నుంచి ఇతర దేశాలకు పంపేందుకు కార్యాచరణ
- మార్కెట్ లింకేజీ, ఇతర సదుపాయాల కల్పన
- రైతుల ఆదాయం పెరిగేలా చర్యలు



క్వాయర్ ఉత్పత్తులు



వెనామీ రొయ్యలు

సాక్షి, అమలాపురం: ఏ రంగమైనా అభివృద్ధి బాట పట్టాలన్నదే ప్రభుత్వ ఆశయం.. ఆలోచన. అందుకే ఇటు కొబ్బరి, అటు మత్స్య సంపదకు నిలయంగా ఉన్న డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లాను ఎగుమతుల్లో అగ్రస్థానంలో నిలిపేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకుంటోంది. జిల్లా నుంచి ఇప్పటికే కొబ్బరి, క్వాయర్, మత్స్య ఉత్పత్తులు ఇతర దేశాలకు ఎగుమతులు అవుతున్నాయి. కానీ అంతర్జాతీయ స్థాయిలో డిమాండ్‌కు తగినట్టుగా ఎగుమతులు ఉండటం లేదని గుర్తించిన ప్రభుత్వం 2030 నాటికి ఎగుమతులు రెట్టింపు చేయాలని నిర్ణయించింది. వీటికి సంబంధించి జిల్లాను ఎక్స్‌పోర్టు హబ్‌గా మార్చనుంది. జిల్లా నుంచి ఈ రెండు ఉత్పత్తుల ఎగుమతులు పెరిగేందుకు వీలుగా తీసుకోవాల్సిన చర్యలపై ప్రణాళికలు సిద్ధం చేస్తోంది. డిపార్ట్‌మెంట్ ఆఫ్ ఇండస్ట్రీస్, కామర్స్ అండ్ ఎక్స్‌పోర్టు ప్రమోషన్‌లో భాగంగా కార్యాచరణ చేపట్టింది.

క్వాయర్‌కు అవకాశాలున్నా..

కొబ్బరిలో క్వాయర్ ఉత్పత్తులు విదేశాలకు ఎగుమతి అవుతున్న విషయం తెలిసిందే. జిల్లాలో సుమారు 410 వరకూ పీచు, తాళ్ల ఉత్పత్తి కేంద్రాలు ఉన్నాయి. ఒక్కో పీచు ఉత్పత్తి కేంద్రంలో రోజుకు టన్ను నుంచి ఐదు టన్నుల వరకూ పీచు ఉత్పత్తి అవుతుంది. ఏడాదికి జిల్లా నుంచి రూ.125 కోట్ల పీచు ఎగుమతి అవుతుందని అంచనా. జిల్లా నుంచి ఎగుమతి అవుతున్న క్వాయర్ ఉత్పత్తుల్లో సింహభాగం అంటే 70 శాతం చైనాకు వెళ్తుండగా, మిగిలిన ఎగుమతి మలేషియా, సింగపూర్, జపాన్‌తో పాటు గల్ఫ్, యూరప్ దేశాలకు ఉంటుంది. చైనాతో ఉద్రిక్తతలు నెలకొన్న ప్రతిసారీ పీచు ధర పడిపోతోంది. అక్కడ రియల్ ఎస్టేట్ దెబ్బతినడం వల్ల కూడా పీచు ఉత్పత్తుల ఎగుమతులు తగ్గాయి. చైనా స్థానంలో యునైటెడ్ అరబ్ ఎమిరేట్స్ (యూఏఈ)కి పెద్దఎత్తున క్వాయర్ ఉత్పత్తులు ఎగుమతి చేసే అవకాశముంది. అయితే మార్కెటింగ్ సౌకర్యం లేక స్థానిక ఉత్పత్తిదారులు అవకాశాలను అందిపుచ్చుకోలేకపోతున్నారు.

మత్స్య ఉత్పత్తుల్లో అగ్రస్థానం

జిల్లాలో పెంచే వెనామీ రొయ్యలు ఇతర దేశాలకు పెద్దఎత్తున ఎగుమతులు అవుతున్నాయి. ఏడాదికి ఈ జిల్లాలో సుమారు 1.10 లక్షల మెట్రిక్ టన్నుల దిగుబడి వస్తోందని మత్స్యశాఖ అధికారులు చెబుతున్నారు. వీటి విలువ రూ.3,080 కోట్లు ఉంటోంది. ఇందులో 70 శాతం అంటే 77 వేల మెట్రిక్ టన్నుల రొయ్యలు అమెరికా, చైనా, జపాన్, యూరప్ దేశాలకు అధికంగా ఎగుమతి అవుతున్నాయి. వెనామీతో పోల్చుకుంటే సముద్ర ఉత్పత్తుల ఎగుమతి తక్కువ.

ఎక్స్‌పోర్టు హబ్‌గా జిల్లా

కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఎగుమతులను ప్రోత్సహించే పథకంలో భాగంగా 2030 నాటికి ఇప్పుడున్న ఎగుమతులను రెట్టింపు చేయాలని లక్ష్యంగా పెట్టుకున్నాయి. డిపార్ట్‌మెంట్ ఆఫ్ ఇండస్ట్రీస్, కామర్స్ అండ్ ఎక్స్‌పోర్టు ప్రమోషన్‌లో భాగంగా జిల్లా నుంచి కొబ్బరి, క్వాయర్, మత్స్య ఉత్పత్తులను రెట్టింపు చేయాలని లక్ష్యంగా చేసుకున్నాయి. ఈ ఉత్పత్తులకు జిల్లాను ఎక్స్‌పోర్టు హబ్‌గా మార్చనున్నాయి. ఇప్పటికే ఒక జిల్లా.. ఒక ఉత్పత్తికి జిల్లాను కొబ్బరికి ఎంపిక చేసిన విషయం తెలిసిందే. దీంతో పాటు మత్స్య సంపద ఎగుమతులు పెంచాలని నిర్ణయించుకుంది. డిపార్ట్‌మెంట్ ఆఫ్ ఇండస్ట్రీస్, కామర్స్ అండ్ ఎక్స్‌పోర్టు ప్రమోషన్ ప్రణాళికను సిద్ధం చేసింది.

- కొబ్బరి, మత్స్య ఉత్పత్తుల ఎగుమతుల కోసం ఫెడరేషన్ ఆఫ్ ఇండియా ఎక్స్‌పోర్ట్సు ఆర్గనైజేషన్ (ఎఫ్ఐఈఓ) సహకారం తీసుకోనుంది. అంతర్జాతీయ ఎగుమతులకు అవసరమైన అన్ని సర్టిఫికెట్లు, అనుమతులను ఇప్పించనుంది. ఈ సంస్థ ఆయా దేశాల్లోని వ్యాపారులతో మార్కెట్ లింకేజీ ఏర్పాటు చేయడానికి కృషి చేయడంతో పాటు, స్థానిక వ్యాపారులకు మార్కెటింగ్ అవకాశాలపై అవగాహన కల్పించనుంది.
- విదేశాల్లో మన ఉత్పత్తులకు ఎక్కడ డిమాండ్ ఉంది? ధర ఎంత వంటి వివరాలు ఎప్పటికప్పుడు చెప్పడంతో పాటు ఎగుమతులు చేసేందుకు ప్రోత్సహించనుంది.
- స్థానిక ఉత్పత్తిదారులను ఆయా దేశాలకు పంపడంతో పాటు అక్కడ ఉత్పత్తుల ప్రదర్శనకు ప్రభుత్వం నుంచి రాయితీలు ఇప్పించనుంది.
- కేంద్ర ప్రభుత్వ రంగ సంస్థల ద్వారా స్థానిక ఉత్పత్తులు నిల్వ చేసుకునేందుకు కామన్ ఫెసిలిటీ సెంటర్ల నిర్మాణంతో పాటు ఇతర మౌలిక సదుపాయాలు కల్పించనుంది.
- స్థానిక ఉత్పత్తులు 35 కిలోల వరకూ ఇతర దేశాలకు తపాలా శాఖ ద్వారా పంపేందుకు స్థానిక కోనసీమ తపాలా శాఖ కార్యాలయాన్ని ఎంపిక చేశారు. తపాలా శాఖ నేరుగా డోర్ డెలివరీ చేస్తోంది.

విలువ ఆధారిత ఉత్పత్తులపై దృష్టి: కలెక్టర్



గ్లోబలైజేషన్ మార్కెట్లో వినియోగదారులు ఆసక్తి చూపుతున్న కొబ్బరి వస్తువుల డిమాండ్‌కు అనుగుణంగా కొబ్బరి విలువ ఆధారిత ఉత్పత్తుల తయారీపై ఉత్పత్తిదారులు దృష్టి సారించాలని కలెక్టర్ హిమాన్షు శుక్లా సూచించారు. శనివారం అమలాపురంలోని కలెక్టరేట్ వద్ద జిల్లా పరిశ్రమల శాఖ, వాణిజ్య ఎగుమతుల ప్రమోషన్ సంయుక్తంగా కొబ్బరి ఉత్పత్తుల తయారీదారులు, రైతు ఉత్పత్తిదారుల ప్రతినిధులతో జిల్లా స్థాయిలో సంప్రదింపుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ కోకోనట్ డెవలప్‌మెంట్ బోర్డు (సీడీబీ) కొబ్బరి ఉత్పత్తులు, వాటి ద్వారా లభించే పోషక విలువలపై సమాజంలో ప్రతి ఒక్కరికీ అవగాహన పెంచాలని కోరారు. కొబ్బరి ఉత్పత్తులకు ఆకర్షణీయమైన ప్యాకింగ్ కల్పించేందుకు చర్యలు చేపట్టి గిట్టుబాటు ధర కల్పనకు కృషి చేయాలన్నారు. అనంతరం కొబ్బరి ఉత్పత్తులు తయారు చేసే వ్యాపారులు, రైతు ఉత్పత్తిదారుల సంస్థల ప్రతినిధుల నుంచి అభిప్రాయాలు సేకరించారు. జిల్లాలో ఎగుమతుల హబ్ కోసం కార్యాచరణ సిద్ధం చేసి కేంద్ర ప్రభుత్వానికి నివేదిస్తామని పరిశ్రమల శాఖ ఎగుమతుల విభాగం సంయుక్త సంచాలకుడు జీఎస్ రావు తెలిపారు. దుబాయికి చెందిన దిగుమతిదారునితో అక్కడ మార్కెట్ అవసరాలపై స్థానిక వ్యాపారులకు జూమ్ ద్వారా అవగాహన కల్పించారు. ఎఫ్ఐఈఓ ప్రతినిధి రఘునాథ్ బాబు, కార్గో రవాణా లాజిస్టిక్స్‌కు చెందిన శంకర్, జిల్లా పరిశ్రమల శాఖ జనరల్ మేనేజర్ పీకేపీ ప్రసాద్, ఏడీ శివరామ్‌ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

పోలీసు వ్యవస్థపై అవగాహన పెరగాలి

జిల్లా ఎస్పీ శ్రీధర్



ఓపెన్ హౌస్ కార్యక్రమాన్ని విద్యార్థులతో కలసి ప్రారంభిస్తున్న ఎస్పీ శ్రీధర్, ఏఎస్పీ బాషా

అమలాపురం టౌన్: విద్యార్థులకు పోలీసు వ్యవస్థపై అవగాహన పెరగాలని, తద్వారా ఉత్తమ సమాజాన్ని ఆవిష్కరించవచ్చని జిల్లా ఎస్పీ సుసరావు శ్రీధర్ అన్నారు. పోలీసు అమరవీరుల సంస్మరణ దినోత్సవాల్లో భాగంగా అమలాపురంలోని ఆర్మ్‌డ్ రిజర్వు పోలీసు కేంద్రంలో శనివారం ఓపెన్ హౌస్ కార్యక్రమాన్ని ఎస్పీ ప్రారంభించారు. పట్టణంలోని వివిధ పాఠశాలలకు చెందిన విద్యార్థులు పాల్గొని పోలీసు విధులు, వారు ఉపయోగించే ఆయుధాలు, పరికరాలు, ఎఫ్ఐఆర్, చార్జిషీట్, వేలిముద్రల సేకరణ, డాగ్ స్క్వాడ్ తదితర అంశాలపై అవగాహన పెంచుకున్నారు. విద్యార్థులకు ఎస్పీ శ్రీధర్‌తో పాటు జిల్లా ఏఎస్పీ ఎస్.ఖాదర్ బాషా, అమలాపురం డీఎస్పీ ఎం.అంబికా ప్రసాద్, ఆర్మ్‌డ్ డీఎస్పీ పి.విజయసారథి, ఎస్పీ కార్యాలయ ఎస్బీ సీఐ రాజశేఖర్, పట్టణ సీఐ టి.క్రాంతికుమార్ తదితరులు పలు అంశాలు వివరించారు. పోలీస్ స్టేషన్లలో రిసెప్షన్ కౌంటర్, రికార్డ్ రూమ్, కంప్యూటర్ విభాగం, ట్రాఫిక్ నిబంధనలు, కేసు నమోదు చేసే విధానం తదితర అంశాలను వివరించారు. నేటి విద్యార్థులు వ్యసనాల బారిన పడకుండా ఉత్తమ సమాజ నిర్మాణంలో భాగస్వాములు కావాలని ఎస్పీ శ్రీధర్ ఆకాంక్షించారు. దిశ యాప్‌ను డౌన్‌లోడ్ చేసుకుని ఆపద సమయంలో పోలీసు సేవలను సద్వినియోగం చేసుకోవాలని విద్యార్థినులకు విజ్ఞప్తి చేశారు. 31వ తేదీ వరకూ జిల్లాలోని వివిధ పోలీస్ స్టేషన్లలో ఈ వారోత్సవాలు జరుగుతాయని అన్నారు.

సీఎం జగన్ పాలన అద్భుతం

- రెవెన్యూ శాఖా మంత్రి ధర్మాన ప్రసాదరావు
- గంటిలో రూ 2.45 కోట్ల అభివృద్ధి పనుల ప్రారంభం



గంటిలో రోడ్డును ప్రారంభించిన మంత్రి ధర్మాన ప్రసాదరావు, ఎమ్మెల్యే చిర్ల జగ్గిరెడ్డి

కొత్తపేట: ప్రజా సంక్షేమమే లక్ష్యంగా ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అద్భుతమైన పాలన సాగిస్తున్నారని, ఇది చరిత్రలో చిరస్థాయిగా నిలిచిపోతుందని రాష్ట్ర రెవెన్యూ శాఖా మంత్రి ధర్మాన ప్రసాదరావు అన్నారు. కొత్తపేట మండలం గంటి గ్రామంలో ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ చిర్ల జగ్గిరెడ్డి ఆధ్వర్యంలో పలు అభివృద్ధి పనుల ప్రారంభోత్సవం శనివారం జరిగింది. రూ.90 లక్షలతో నిర్మించిన పల్లిపాలెం బీటీ, సీసీ రోడ్లు, జల్‌జీవన్ మిషన్ నిధులు రూ.1.33 కోట్లతో ఇంటింటికీ కుళాయి పథకం కింద మెయిన్ విలేజ్‌లో నిర్మించిన 90 వేల లీటర్ల, పెదపేటలో నిర్మించిన 40 వేల లీటర్ల రక్షిత మంచినీటి పథకాలను, రూ.21.80 లక్షలతో నిర్మించిన ఆర్‌బీకేను మంత్రి ధర్మాన ప్రసాదరావు ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం అవినీతికి ఆస్కారం లేకుండా, మధ్యవర్తుల ప్రమేయం లేకుండా రూ.లక్షల కోట్లను పథకాల ద్వారా అర్హుల ఖాతాలకు జమ చేస్తుందన్నారు. వైఎస్సార్ సీపీ ప్రభుత్వ పాలన దేశానికే ఆదర్శంగా నిలుస్తుందన్నారు. గత టీడీపీ పాలనలో జన్మభూమి కమిటీలకు, డబ్బులు సమర్పించుకున్న వారికే పథకాలు అందేవన్నారు. ప్రస్తుతం జగనన్న సారథ్యంలో అర్హులైతే చాలు పార్టీలతో సంబంధం లేకుండా సంక్షేమ పథకాలు అందజేస్తున్నారని వివరించారు. ఎక్కడా అవినీతికి ఆస్కారం లేకుండా అందరికీ పథకాలు అందుతున్నాయన్నారు. ఇటువంటి పాలననే ప్రజలు కోరుకుంటారని అన్నారు. రైతులు, డ్వాక్రా మహిళలు, యువతను నమ్మించి మోసగించిన చంద్రబాబు ముఠాను ప్రజలు నమ్మే స్థితిలో లేరన్నారు. టీడీపీ పాలనలో ప్రజలకు ఏం చేశారో చెప్పుకోవడానికి లేక, వైఎస్సార్ సీపీ పాలనపై లేనిపోని ఆరోపణలు చేస్తున్నారని అన్నారు. ఆయా కార్యక్రమాల్లో జాయింట్ కలెక్టర్ నూపుర్ అజయ్, ఆర్డీఓ ఎం.ముక్కంటి, అముడ చైర్మన్ గొల్లపల్లి డేవిడ్‌రాజు, ఎంపీపీ మార్గన గంగాధరరావు, జెడ్పీటీసీ గూడపాటి రమాదేవి, సర్పంచ్ సాగి బంగార్రాజు, డీసీఎంఎస్ చైర్‌పర్సన్ సాకా మణికుమారి, డీసీసీబీ పర్సన్ బండారు రాజా, ఎంపీటీసీ ముళ్ల జనార్ధన్, పీఏసీఎస్ పర్సన్ ఇన్‌చార్జి మట్టపర్తి వెంకట్రావు తదితరులు పాల్గొన్నారు.

గ్రామాల స్వచ్ఛతకు వినూత్న కార్యక్రమం

నెలపర్తిపాడులో శ్రీకారం చుట్టిన మంత్రి వేణుగోపాలకృష్ణ



నెలపర్తిపాడులో స్వచ్ఛత- మన బాధ్యత కార్యక్రమంలో మంత్రి వేణుగోపాలకృష్ణ

రామచంద్రపురం రూరల్: జగనన్న స్వచ్ఛ సంకల్పం సాధనకు రాష్ట్ర బీసీ సంక్షేమ మంత్రి చెల్లుబోయిన వేణు ఓ వినూత్న కార్యక్రమానికి శ్రీకారం చుట్టారు. అదేంటంటే.. స్వచ్ఛత- మన బాధ్యత కార్యక్రమంలో భాగంగా నియోజకవర్గంలోని గ్రామాలను క్లస్టర్లుగా విభజించారు. క్లస్టర్ పరిధిలోని ఐదారు గ్రామాల పారిశుధ్య కార్మికులతో పాటు ఉపాధి హామీ కూలీలు, వలంటీర్లు, సచివాలయ ఉద్యోగులు, ప్రజాప్రతినిధులు, ఉత్సాహవంతులైన యువత, మహిళల సహకారంతో గ్రామ వీధుల్లో పూర్తి పరిశుభ్రత కార్యక్రమాలు చేపడతారు. ఈ చెత్తను ఒక చోట చేర్చి మర్నాడు పెద్ద గొయ్యి తీసి అందులో చెత్త వేస్తారు. ఇది ఎరువుగా మారేందుకు కెమికల్స్‌ను వేసి గొయ్యి మూసివేస్తారు. మూడు నెలల తరువాత గొయ్యి తెరచి ఎరువుగా మారిన చెత్తను గ్రామంలో వినియోగిస్తారు. తొలిసారిగా నెలపర్తిపాడులో శనివారం ఈ విధానాన్ని మంత్రి వేణు ప్రారంభించారు.

ప్రథమ వైద్యుడు పారిశుధ్య కార్మికుడు

ఈ సందర్భంగా జరిగిన సమావేశంలో మంత్రి వేణు మాట్లాడుతూ చెత్తను తొలగించే పారిశుధ్య కార్మికుడు ప్రథమ వైద్యుడు అని మంత్రి వేణు అన్నారు. వీరికి కొంత పనిభారం తగ్గించేందుకు అందరూ ముందుకు రావాలన్నారు. చెత్తను ప్లాస్టిక్ వ్యర్థాలు, మట్టిలో కలిసే తడి వ్యర్థాలుగా వేరు చేయాలని సూచించారు. ప్లాస్టిక్ వ్యర్థాలను రీసైక్లింగ్ చేసేవారికి ఇస్తే కొంత సొమ్ము కూడా వస్తుందన్నారు. తడి చెత్తను గొయ్యి తీసి పాతిపెట్టడం ద్వారా ఎరువుగా మార్చుకోవచ్చన్నారు. రెండు రోజులు కష్టపడితే గ్రామంలో వ్యత్యాసం స్పష్టంగా కనిపిస్తుందన్నారు. ఈ మార్పు శాశ్వతంగా ఉండేలా గ్రామస్తులు నిత్యం కృషి చేయాలని కోరారు. సర్పంచ్ రాయుడు సీతామహాలక్ష్మి, ఎంపీపీ అంబటి భవాని, వైస్ ఎంపీపీలు నరాల రాజ్యలక్ష్మి, శాకా బాబీ, ఏపీఐడీసీ డైరెక్టర్ వాసంశెట్టి శ్యామ్, వైఎస్సార్ సీపీ జిల్లా కార్యదర్శి టేకుమూడి సత్యనారాయణ, సర్పంచులు పాల్గొన్నారు.

పరిశ్రమలను ప్రోత్సహించండి



కాన్ఫరెన్స్‌లో మాట్లాడుతున్న కలెక్టర్ హిమాన్షు శుక్లా

అమలాపురం రూరల్: జిల్లాలో సూక్ష్మ, చిన్న, మధ్య తరహా పరిశ్రమలను ప్రోత్సహించాలని కలెక్టర్ హిమాన్షు శుక్లా పరిశ్రమల శాఖ అధికారులకు సూచించారు. శనివారం రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కేఎస్ జవహర్‌రెడ్డి హైదరాబాద్ నుంచి వివిధ జిల్లాల కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. వైఎస్సార్ జగనన్న శాశ్వత భూహక్కు భూరక్ష రీసర్వే, జాతీయ రహదారులకు భూసేకరణ, మల్టీపర్పస్ ఫెసిలిటేటెడ్ గోదాముల నిర్మాణానికి స్థల సేకరణ, జగనన్న పాలవెల్లువ, చిరుధాన్యాల సాగుకు ప్రోత్సాహం, ఇళ్ల పట్టాల జారీ, ప్రభుత్వ ప్రాధాన్య భవనాలు, పరిశ్రమలకు ప్రోత్సాహం తదితర కార్యక్రమాలపై సమీక్షించారు. స్థానిక కలెక్టరేట్ నుంచి శుక్లా పాల్గొన్నారు. అనంతరం ఆయన జిల్లాలోని అధికారులను ఉద్దేశించి మాట్లాడుతూ రాయవరం మండలం మాచవరంలో క్లస్టర్ డెవలప్‌మెంట్ కింద కమ్యూనిటీ ఫెసిలిటేషన్ కేంద్రాన్ని నెలకొల్పామన్నారు. రబీలో రాయితీపై విత్తనాలు అందించేందుకు చర్యలు చేపట్టాలన్నారు. అపరాల సాగుకు అవకాశం ఉన్న క్షేత్రాలను గుర్తించి రాయితీలు అందించాలన్నారు. జిల్లా జాయింట్ కలెక్టర్ ఎస్.నూపుర్ అజయ్, డీఆర్వో సీహెచ్ సత్తిబాబు, ఆర్డీఓ జి.కేశవర్ధన్‌రెడ్డి, సీపీఓ వెంకటేశ్వర్లు, డీఆర్డీఏ పీడీ డాక్టర్ బి.శివశంకర్‌ప్రసాద్, జిల్లా పరిశ్రమల కేంద్రం జనరల్ మేనేజర్ పీకేపీ ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

సహకార సంఘాల్లో కార్పొరేట్ స్థాయి సేవలు



యండగండి వ్యవసాయ సహకార సంఘం వద్ద జిల్లా సహకార అధికారులు, సంఘాల సీఈఓలు

అమలాపురం టౌన్: పశ్చిమగోదావరి జిల్లా యండగండి, ఏలేటిపాడు సాధారణ వ్యవసాయ సహకార సంఘాల్లో కార్పొరేట్ బ్యాంక్‌లకు దీటుగా రైతులకు సేవలు అందుతున్నాయని జిల్లా సహకార అధికారి ఎ.రాధాకృష్ణారావు అన్నారు. జిల్లాకు చెందిన సహకార సంఘాల సీఈఓలకు జరుగుతున్న శిక్షణలో భాగంగా యండగండి, ఏలేటిపాడు సంఘాల్లో శనివారం స్టడీ టూర్ నిర్వహించారు. శనివారం అమలాపురం నుంచి ప్రత్యేక బస్సులో అక్కడకు సహకార సీఈఓలు వెళ్లారు. ఈ సందర్భంగా రాధాకృష్ణారావు మాట్లాడుతూ ఏలేటిపాడు సంఘంలో 23 రకాల పరపరేతర సేవలను అందుబాటులోకి తీసుకు వచ్చారన్నారు. ఈ సంఘం ద్వారా పెట్రోల్ బంక్, మందుల షాపు, పాల సేకరణ దుకాణం, వరికోత యంత్రం, వరినాట్ల యంత్రం సేవలు నిర్వహిస్తున్నారన్నారు. యండగండి సంఘంలోనూ ఇదే తరహాలో రైతులకు సేవలు అందుతున్నాయన్నారు. ఈ రెండు సంఘాలను కార్పొరేట్ బ్యాంక్‌లను తలపించేలా అభివృద్ధి చేసి సేవలు అందిస్తున్న తీరుపై జిల్లా సీఈఓలకు అవగాహన కల్పించారు. జిల్లా సహకార ఆడిట్ అధికారి ఎస్.మురళీకృష్ణ ఆ సంఘాల్లో జరుగుతున్న పక్కా ఆడిట్ విధానాలను వివరించారు. జిల్లా సహకార ట్రైనింగ్ ఇన్‌చార్జి ఆదిమూలం వెంకటేశ్వరరావు, న్యూఢిల్లీ నేషనల్ సెంటర్ ఫర్ కో ఆపరేటివ్ ఎడ్యుకేషన్, రాష్ట్ర సహకార యూనియన్ సంయుక్త ఆధ్వర్యంలో ఐదు రోజులుగా జరుగుతున్న శిక్షణ తరగతుల్లో నాలుగో రోజు జిల్లా సహకార సీఈఓలకు ఈ స్టడీ టూర్ ఏర్పాటైంది.

ఆసుపత్రుల్లో పోస్టుల భర్తీకి నోటిఫికేషన్

అమలాపురం టౌన్: ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలోని ఆంధ్రప్రదేశ్ వైద్యవిధాన పరిషత్ ఆసుపత్రుల్లో ఖాళీగా ఉన్న పలు పోస్టులను కాంట్రాక్ట్, అవుట్ సోర్సింగ్ ప్రాతిపదికన భర్తీ చేసేందుకు నోటిఫికేషన్ విడుదలైంది. ఫార్మాసిస్ట్ గ్రేడ్–2 పోస్టులు 2, ఆడియో మెట్రీషియన్ పోస్టు–1 కాంట్రాక్ట్ పద్ధతిన, ల్యాబ్ అటెండెంట్ పోస్టు–1 అవుట్ సోర్సింగ్ పద్ధతిలో భర్తీ చేయనున్నట్లు పూర్వపు తూర్పుగోదావరి జిల్లా వైద్య సేవల సమన్వయ అధికారి కార్యాలయం శనివారం ఓ ప్రకటన విడుదల చేసింది. ఈ పోస్టుల భర్తీకి అభ్యర్థుల నుంచి దరఖాస్తులు కోరుతున్నారు. అభ్యర్థులు శనివారం నుంచి నవంబర్ 3వ తేదీ వరకూ ఉదయం 10.30 గంటల నుంచి సాయంత్రం 5 గంటల లోపు దరఖాస్తులను కొవ్వూరులోని జిల్లా వైద్య సేవల సమన్వయాధికారి కార్యాలయంలో అందజేయాలి. ఏడాది కాల పరిమితితో ఈ పోస్టులను భర్తీ చేసేందుకు లిమిటెడ్ రిక్రూట్‌మెంట్ నోటిఫికేషన్ జారీ అయ్యిందని ఆ కార్యాలయం వివరించింది.

మున్సిపల్ ఉద్యోగి అరెస్ట్

మండపేట: స్థానిక గాంధీనగర్‌కు చెందిన బాలుడి (4)పై లైంగిక దాడికి పాల్పడిన మున్సిపల్ ఉద్యోగిని శనివారం పట్టణ పోలీసులు అరెస్ట్ చేశారు. మండపేట మున్సిపల్ కార్యాలయంలో రికార్డ్ అసిస్టెంట్‌గా పనిచేస్తున్న నాయుడు శ్రీను తమ కుమారుడిని ఆడిస్తానని తీసుకువెళ్లి లైంగిక దాడికి పాల్పడినట్లు రెండు రోజుల కిందట బాలుడి తల్లిదండ్రులు పోలీసులకు ఫిర్యాదు చేసిన విషయం విధితమే. ఈ ఘటనపై పట్టణ పోలీసులు కేసు నమోదు చేశారు. ఎస్పీ శ్రీధర్ ఆదేశాల మేరకు దిశా డీఎస్పీ సుంకర మురళీమోహన్ దర్యాప్తు చేపట్టారు. నిందితుడిని అదుపులోకి తీసుకుని ఆలమూరు జేఎఫ్‌సీఎం కోర్టుకు తరలించారు. త్వరితగతిన దర్యాప్తు పూర్తి చేసి చార్జిషీట్ ఫైల్ చేస్తామని డీఎస్పీ మురళీమోహన్ తెలిపారు. పిల్లల పట్ల తల్లిదండ్రులు అప్రమత్తంగా ఉండి మరిన్ని జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు.

అనుమానాస్పద స్థితిలో వివాహిత మృతి

కొవ్వూరు: స్థానిక ఇందిరమ్మ కాలనీలో ముప్పిడి దివ్యకుమారి (33) అనుమానాస్పద స్థితిలో శనివారం మృతి చెందింది. భర్త మందలించాడనే మనస్తాపంతో ఫ్యాన్‌కు చున్నీతో ఉరి వేసుకుని మృతి చెందినట్లు పట్టణ సీఐ వి.జగదీశ్వరరావు తెలిపారు. ఆయన కథనం ప్రకారం.. కాపవరానికి చెందిన దివ్యకుమారికి కొవ్వూరుకు చెందిన రవిబాబుతో నాలుగేళ్ల కిందట వివాహమైంది. వీరికి ఏడాది వయసున్న కుమార్తె ఉంది. శనివారం కుమార్తెను సరిగా చూడడం లేదని భర్త మందలించడంతో పక్క గదిలోకి వెళ్లి ఫ్యాన్‌కు చున్నీతో ఉరి వేసుకున్నట్లు చెబుతున్నారు. తమ కుమార్తె మృతికి భర్త వేధింపులే కారణమని దివ్యకుమారి తల్లిదండ్రులు ఆరోపిస్తున్నారు. మృతిరాలి బంధువుల ఫిర్యాదు మేరకు అనుమానాస్పద మృతిగా కేసు నమోదు చేసినట్లు సీఐ వివరించారు.

అక్రమ మార్గంలో ఆర్జించాలని..

- హర్యానా నుంచి మద్యం తీసుకొచ్చి విక్రయాలు
- రాజమహేంద్రవరంలో పట్టుబడిన నిందితులు
- 774 మద్యం సీసాల స్వాధీనం, ఆరుగురి అరెస్టు

ఆల్కాట్‌తోట (రాజమహేంద్రవరం రూరల్): అధిక సొమ్ముకు ఆశ పడ్డారు.. అక్రమ మార్గంలో ఆర్జించాలని ఎత్తులు వేశారు.. చివరికి పోలీసులకు చిక్కి కటకటాల పాలయ్యారు.. హర్యానా మద్యాన్ని అక్రమంగా విక్రయిస్తున్న ఆరుగురిని పోలీసులు అరెస్ట్ చేసిన ఘటన రాజమహేంద్రవరంలో చోటుచేసుకుంది. హర్యానా నుంచి ఎన్‌డీపీ లిక్కర్‌ను రాజమహేంద్రవరానికి తరలించి విక్రయిస్తున్న ఆరుగురిని అరెస్టు చేసినట్లు జిల్లా స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ ఆఫీసర్ (అడిషనల్ ఎస్పీ) పిట్టా సోమశేఖర్ తెలిపారు. శనివారం సాయంత్రం ఎస్ఈబీ రాజమహేంద్రవరం సౌత్ స్టేషన్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన వివరాలు వెల్లడించారు. ఆయన కథనం ప్రకారం.. బొమ్మూరు గ్రామానికి చెందిన శెట్టి నాగేశ్వరరావు, తులుగు రమేష్, పిసిని సురేష్, ఉండ్రాజవరానికి చెందిన మాస రవి, రాజమహేంద్రవరం సంజీవనగర్‌కు చెందిన ఏడాకుల నాగదుర్గాప్రసాద్, దేవరపల్లికి చెందిన చెల్లింకి చిన్నబాబులు కొంతకాలంగా హర్యానా నుంచి మద్యాన్ని కొనుగోలు చేసి వాటిని ఇక్కడకు తీసుకొచ్చి ఎటువంటి అధికార పత్రాలు లేకుండా అధిక ధరకు విక్రయించి సొమ్ము చేసుకుంటున్నారు. శనివారం సాయంత్రం ఓ లారీలో 63 అట్టపెట్టెలలో 774 మద్యం సీసాలను దివాన్‌చెరువు ఆటోనగర్ సెంటర్ వేయింగ్ మెషీన్ వెనుక ప్రదేశంలో పెట్టి అక్రమంగా విక్రయిస్తున్నారు. ఎస్ఈబీ డిస్ట్రిక్ట్ స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ ఆఫీసర్ పిట్టా సోమశేఖర్ ఆదేశాల మేరకు, ఎస్ఈబీ రాజమహేంద్రవరం సౌత్‌స్టేషన్ ఇన్‌స్పెక్టర్ పి.హనుశ్రీకు వచ్చిన సమాచారం మేరకు ఎస్ఈబీ ఇన్‌స్పెక్టర్ పి.అప్పారావు, సౌత్ ఎస్సై పి.చిట్టిబాబు, సిబ్బందితో కలసి దాడులు చేశారు. ఈ సందర్భంగా పైఆరుగురు నిందితులను అరెస్టుచేసి, హర్యానాకు చెందిన 774 ఎన్‌డీపీఎల్ మద్యం సీసాలను, లారీని స్వాధీనం చేసుకున్నారు. నిందితులను రిమాండ్‌కు తరలించనున్నట్లు ఏఎస్పీ తెలిపారు. హర్యానాలో మద్యం సరఫరా చేసిన వికాస్‌వర్మను అరెస్టు చేయాల్సి ఉందన్నారు. హర్యానాలో ఈ మద్యం విలువ రూ.3.47 లక్షలు కాగా, ఆంధ్రప్రదేశ్‌లో రూ.10.46 లక్షలు ఉంటుందన్నారు.



స్వాధీనం చేసుకున్న మద్యం పెట్టెలు, నిందితులను చూపుతున్న ఎస్ఈబీ ఏఎస్పీ పిట్టా సోమశేఖర్

ఆర్థికంగా ఎదిగేందుకే...

అప్పులపాలైన లారీ యజమాని కం డ్రైవర్ శెట్టి నాగేశ్వరరావు ఢిల్లీకి కిరాయికి వెళ్లి తిరిగి వస్తుండగా హర్యానా తదితర ప్రాంతాల్లో మద్యం కొనుగోలు చేసి రాజమహేంద్రవరం పరిసర ప్రాంతాలలో మిగిలిన నిందితులతో కలసి మద్యం విక్రయించడం ద్వారా సొమ్ము సంపాదిస్తున్నాడు. గతంలో తక్కువగా మద్యం తీసుకువచ్చే నాగేశ్వరరావు ఈ సారి 75 పెట్టెలను తీసుకువచ్చి అందులో 12 పెట్టెలను ఇతర లారీ డ్రైవర్లకు విక్రయించాడని ఎస్ఈబీ ఏఎస్పీ సోమశేఖర్ తెలిపారు. ఎక్కడైనా మద్యాన్ని అక్రమంగా రవాణా చేసినా, అధిక ధరలకు అమ్మినా ఎస్ఈబీ నంబరు 14500కు గాని, డయల్ 100కు గాని, దగ్గరలోని పోలీస్ స్టేషన్‌కు కాని కాల్‌చేసి సమాచారం ఇవ్వాలన్నారు. సమాచారం ఇచ్చిన వారి వివరాలు గోప్యంగా ఉంచుతామన్నారు. ఎన్‌డీపీఎల్ మద్యాన్ని పట్టుకున్న ఇన్‌స్పెక్టర్, సిబ్బందికి రివార్డుల కోసం ఎస్ఈబీ కమిషనర్‌కు సిఫార్సు చేస్తామన్నారు. సమావేశంలో సౌత్ ఇన్‌స్పెక్టర్ పి.హనుశ్రీ, ఎస్ఈబీ ఇన్‌స్పెక్టర్ పి.అప్పారావు, ఎస్సై చిట్టిబాబు, సిబ్బంది పాల్గొన్నారు.

లక్ష మందితో మాదిగ, ఉపకులాల కలయిక

ఎమ్మెల్సీ బొమ్మి ఇజ్రాయిల్



ఐక్యత చాటుతున్న ఎమ్మెల్సీ బొమ్మి ఇజ్రాయిల్, మాదిగ సంఘాల నాయకులు

అమలాపురం రూరల్: అమలాపురంలో డిసెంబర్ 11న లక్ష మంది మాదిగ, మాదిగ ఉపకులాలతో రాజకీయ ఆత్మీయ కలయిక సభ నిర్వహిస్తామని మాదిగల పొలిటికల్ జేఏసీ చైర్మన్, ఎమ్మెల్సీ బొమ్మి ఇజ్రాయిల్ తెలిపారు. నడిపూడిలోని బాబూ జగ్జీవన్‌రామ్ కమ్యూనిటీ హాలులో డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లాలోని 16 మండలాల మాదిగ సంఘాల నాయకులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్సీ ఇజ్రాయిల్ మాట్లాడుతూ ఈ సభకు రాష్ట్రంలోని అధికార పార్టీ మాదిగ మంత్రులు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలతో పాటు ప్రతిపక్ష పార్టీల మాదిగ నాయకులు పాల్గొంటారన్నారు. మాదిగ, మాదిగ ఉపకులాల ప్రజలంతా విచ్చేసి కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. నాయకులు యార్లగడ్డ సత్తిబాబు, మల్లిపూడి రాజు, ఆకుమర్తి రమేష్, చాట్ల రామారావు, యు.నాగబాబు, క్రాప నాగభూషణం, మడికి శ్రీరాములు, యార్లగడ్డ రవీంద్ర, ఆకుమర్తి సత్యనారాయణ, ముమ్మిడివరపు శ్రీను, చెట్ల సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

విద్యుదాఘాతంతో భవన నిర్మాణ కార్మికుడి మృతి

అమలాపురం టౌన్: అమలాపురం హైస్కూల్ సెంటర్‌లో నిర్మాణంలో ఉన్న ఓ షాపింగ్ మాల్‌లో పనిచేస్తున్న ఉత్తరప్రదేశ్ రాష్ట్రానికి చెందిన భవన నిర్మాణ కార్మికుడు సత్యంకుమార్ (20) విద్యుత్ షాక్‌కు గురై శనివారం మధ్యాహ్నం దుర్మరణం పాలయ్యాడు. అతడు విద్యుత్ షాక్‌కు గురై అపస్మారక స్థితిలో వెళ్లిన మరుక్షణమే తోటి కార్మికులు సమీపంలో ఉన్న ఓ ప్రైవేట్ ఆస్పత్రికి అత్యవసర వైద్యం కోసం తరలించారు. అప్పటికే సత్యంకుమార్ మృతి చెందినట్లు వైద్యులు ధ్రువీకరించారు. దీంతో మృతదేహాన్ని అమలాపురం ప్రభుత్వ ఏరియా ఆస్పత్రికి తరలించారు. కార్మికుడి మృతి మెడికో లీగల్ కేసు అవుతుందని, ఆ మృతదేహాన్ని ఆస్పత్రి మార్చురీలో భద్రపరిచామని, అతని కుటుంబీకులు వచ్చాక పోస్టుమార్టం నిర్వహిస్తామని ఆసుపత్రి సూపరింటిండెంట్ డాక్టర్ కె.శంకరరావు తెలిపారు. షాపింగ్ మాల్‌లో ఇంటీరియల్ డెకరేషన్ పనుల కోసం ఉత్తరప్రదేశ్ రాష్ట్రం నుంచి అమలాపురానికి వచ్చిన సత్యంకుమార్ ఆ పనిలో ఉండగా విద్యుత్ షాక్‌కు గురయ్యాడు.



ఉత్తరప్రదేశ్ రాష్ట్రానికి చెందిన సత్యంకుమార్ మృతదేహం

రూ. వెయ్యి కోట్ల కార్గో ఆదాయం లక్ష్యం

ఆర్టీసీ బోర్డు డైరెక్టర్ రాజారెడ్డి వెల్లడి



ఆర్టీసీ డిపో ఆవరణలో మొక్క నాటిన ఏపీఎస్ ఆర్టీసీ బోర్డు డైరెక్టర్ రాజారెడ్డి తదితరులు

కాకినాడ: సరకు రవాణా ద్వారా 2023– 24 ఆర్థిక సంవత్సరానికి రూ.వెయ్యి కోట్ల ఆదాయాన్ని ఆర్జించాలన్నదే లక్ష్యమని ఏపీఎస్ ఆర్టీసీ బోర్డు డైరెక్టర్ ఎ.రాజారెడ్డి అన్నారు. శనివారం ఆయన కాకినాడ ఆర్టీసీ డిపోను సందర్శించారు. అక్కడ జరుగుతున్న సరకు రవాణా, డోర్ డెలివరీ విధానం, డిపో పరిసరాలను పరిశీలించారు. గ్యారేజ్ ఆవరణలో మొక్కలు నాటే కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజలకు మెరుగైన సేవలు అందించడం ద్వారా సరకు రవాణా సేవలను మరింత విస్తృతం చేయాలన్నారు. ముఖ్యంగా బల్క్ ట్రాన్స్‌పోర్టుపై దృష్టి పెట్టాలని సూచించారు. వాణిజ్యపరంగా అభివృద్ధి చెందుతున్న కాకినాడ వంటి ప్రాంతాల్లోని రేవు కార్యకలాపాలు, ఇతర అంశాలను దృష్టిలో ఉంచుకుని ఆయా వర్గాలను స్వయంగా కలసి ఆర్టీసీ అందిస్తోన్న సరకు రవాణా సేవలను అర్థమయ్యేలా వివరించాలన్నారు. తక్కువ ఖర్చుతో సురక్షితంగా సేవలందిస్తున్న విధానాన్ని అన్నివర్గాలకు తెలిపాలని కోరారు. జిల్లా ప్రజా రవాణాధికారి ఎం.శ్రీనివాసరావు మాట్లాడుతూ సరకు రవాణా ద్వారా గత ఏడాది లక్ష్యాన్ని అధిగమించామని, ఈ ఏడాది సుమారు 37 శాతం లక్ష్యాన్ని చేరుకున్నామని చెప్పారు. కాకినాడ ప్రాంతంలో ఆక్వా ఎగుమతులు, ఎరువులు, ఎరువుల పరిశ్రమలతో పాటు మరెన్నో కార్యకలాపాలు జరుగుతున్నాయన్నారు. రానున్న రోజుల్లో ప్రభుత్వ లక్ష్యానికి అనుగుణంగా సరకు రవాణా పెంచేందుకు చర్యలు తీసుకుంటామన్నారు. ఇందుకోసం కార్గో వాహనాన్ని సమకూర్చాలని విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో కార్గో సీటీఎం రమణ, వివిధ డిపోల మేనేజర్లు ఎంయూవీ మనోహర్, జీవీవీ సత్యనారాయణ, కార్గో ఏటీఎం మాధవ్, అసిస్టెంట్ మేనేజర్లు టి.బాలకృష్ణ, మాలిం బాషా, జీజీవీ రమణ, స్టేషన్ మేనేజర్ జి.శ్రీనివాస్ పాల్గొన్నారు.

ఫుడ్ టెక్నాలజీ రంగానికి అధిక ప్రాధాన్యం

- 'నన్నయ' యూనివర్సిటీ వీసీ ఆచార్య పద్మరాజు
- ఫుడ్ టెక్నాలజీ కోర్సుపై సీఎస్ఆర్ఐతో ఒప్పందం



ఎంఓయూ ప్రతులను మార్చుకుంటున్న ప్రతినిధులు

రాజానగరం: దేశంలోని బెంగళూరు, హైదరాబాద్ వంటి మెట్రో నగరాల్లో ఐటీ తరువాత ఫుడ్ టెక్నాలజీ రంగానికే అధిక ప్రాధాన్యం ఉందని ఆదికవి నన్నయ యూనివర్సిటీ వీసీ ఆచార్య కె.పద్మరాజు అన్నారు. 2024లో తొమ్మిది మిలియన్ల ఉద్యోగావకాశాలు ఈ రంగంలోనే లభిస్తాయన్నారు. దీనిని దృష్టిలో పెట్టుకుని అన్నపూర్ణ జిల్లాలుగా పేరొందిన ఉమ్మడి ఉభయగోదావరి జిల్లాల్లోని యువతకు సరైన ఉపాధి అవకాశాలను కల్పించాలనే ఉద్దేశంతో 'నన్నయ' వర్సిటీలో ఎంఎస్సీ ఫుడ్ టెక్నాలజీ కోర్సును ప్రవేశపెడుతున్నామన్నారు. రెండేళ్ల వ్యవధితో కూడిన ఈ కోర్సును సమర్థవంతంగా నిర్వహించేందుకు మైసూరులోని కౌన్సిల్ ఆఫ్ సైంటిఫిక్ అండ్ ఇండస్ట్రీయల్ రీసెర్చ్ (సీఎస్ఆర్ఐ), సెంట్రల్ ఫుడ్ టెక్నాలాజికల్ రీసెర్చ్ ఇనిస్టిట్యూట్‌తో 'నన్నయ' యూనివర్సిటీ అవగాహన ఒప్పందం చేసుకుంది. ఇందుకు సంబంధించిన రాత ప్రతులను యూనివర్సిటీ కన్వెన్షన్ హాలులో శనివారం జరిగిన కార్యక్రమంలో సీఎస్ఆర్ఐ, సీఎఫ్‌టీఆర్ఐ డైరెక్టర్ డాక్టర్ శ్రీదేవి అన్నపూర్ణసింగ్, నన్నయ రిజిస్ట్రార్ ఆచార్య జి.సుధాకర్‌లు సంతకాలు చేసి పరస్పరం మార్చుకున్నారు. ఈ సందర్భంగా వీసీ పద్మరాజు మాట్లాడుతూ ఈ ఒప్పందం ద్వారా కోర్సుకు అవసరమైన మార్గనిర్దేశం చేయడం, ప్రోగ్రామ్ రూపకల్పన కోసం నిపుణులను బీఓఎస్‌కి నామినేట్ చేయడం, అతిథి ఉపన్యాసాలను నిర్వహించడం, చెల్లింపు ప్రాతిపదికన విద్యార్థులకు ప్రాజెక్టు వర్కును ఆఫర్ చేయడం వంటి ప్రయోజనాలు అందుతాయన్నారు. అలాగే యూనివర్సిటీ పరంగా ప్రాంతీయ, సంప్రదాయ, ముడి పదార్థాలపై సర్వేలు నిర్వహించడం, ప్రాసెసింగ్ డేటా సేకరణ, వర్క్‌షాప్‌లు, సెమినార్లు తదితర వాటి నిర్వహణ చేస్తారన్నారు. సీఎస్ఆర్ఐ, సీఎఫ్‌టీఆర్ఐ డైరెక్టర్ డాక్టర్ శ్రీదేవి అన్నపూర్ణసింగ్ మాట్లాడుతూ ఈ ఎంఓయూ ద్వారా నూతన ఫుడ్ టెక్నాలజీ విషయాలు ప్రాక్టికల్‌గా అర్థమవుతాయన్నారు. నాణ్యమైన ఆరోగ్యవంతమైన జీవనంలో ఫుడ్ కీలకపాత్ర పోషిస్తుందన్నారు. దేశంలోని ప్రముఖ జాతీయ, అంతర్జాతీయ సంస్థలతో సీఎఫ్‌టీఆర్ఐ సంబంధం కలిగి ఉందన్నారు. ఈ అనుబంధంలోకి 'నన్నయ' వర్సిటీ కూడా రావడం హర్షణీయమన్నారు. వైఎస్సార్ హార్టీకల్చర్ యూనివర్సిటీ వీసీ ఆచార్య తోలేటి జానకిరామ్, డిపార్టుమెంట్ ఆఫ్ ఫుడ్ టెక్నాలజీ ప్రొఫెసర్ ఆచార్య పి.రామకృష్ణ, ప్రిన్సిపాల్ డాక్టర్ పి.విజయనిర్మల, డీన్ ఆచార్య వై.శ్రీనివాసరావు, హెచ్‌ఓడీ డాక్టర్ డి.కల్యాణి పాల్గొన్నారు.